క్లుప్తంగా

చేనేత ఐక్య వేదిక రాష్ట్ర మీడియా కార్యదర్శిగా శ్రీనివాస్


రావిరాల శ్రీనివాస్ నేత

మిర్యాలగూడ టౌన్ : తెలంగాణ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా కార్యదర్శిగా పట్టణానికి చెందిన రావి రాల శ్రీనివాస్ నేతను నియమించారు. సోమవారం ఆ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ ఉత్తర్వులను జారీ చేశారు. అనంతరం ఆయనకు నియామక పత్రం అందజేశారు. తన నియమానికి సహకరించిన నేతలకు కృతజ్ఞతలు తెలిపారు..

టెయిల్‌పాండ్ దిగువకు నీటి విడుదల

అడవిదేవులపల్లి : అడవిదేవులపల్లి కేంద్రం సమీపంలోని టెయిల్‌పాండ్ నుంచి దిగువకు సోమవారం 2,13,088 క్యూ సెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు డ్యాం అధికారులు తెలిపారు. నాగార్జునసాగ్ జలాశయం నుంచి 2,16,880 క్యూ సెక్కుల నీరు టెయిల్‌పాండ్‌కు వచ్చి చేరుతుందని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మిర్యాలగూడ అర్బన్ : ఎఫ్‌సీఐ సబ్‌స్టేషన్‌లో హనుమాన్‌పేట ఫీడర్ కింద మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ ఎస్.రవీందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకనటలో తెలిపారు. జాతీయ రహదారి టవర్లపై లేన్ లాగడంలో భాగంగా ఉదయం 7గంటల నుంచి 9గంటల వరకు సాగర్‌రోడ్డులోని కుడివైపుగా ఉన్న ఎల్‌ఐసీ కార్యాలయం నుంచి జీవీమాల్, సత్యకమల కాంప్లెక్స, ఎచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, రాయాలయం ఏరియాలకు విద్యుత్ సరఫరా నిలివేస్తున్నట్లు తెలిపారు.వినియోగదారులు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

ఎమ్మెల్యేకు వినతి


ఎమ్మెల్యే బాలునాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న అధ్యాపకులు

చింతపల్లి : మండల కేంద్రంలోని డాక్టర్ ఏజేఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు కాంపౌండ్ వాల్ ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేయాలని కోరుతూ ఆ కళాశాల అధ్యాపకులు సోమవారం ఎమ్మెల్యే బాలునాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ధన్ రాజు, లెక్చరర్స్ కిరణ్ కుమార్, రామస్వామి, వాసురాం, ప్రభాకర్ రెడ్డి, అంజయ్య పాల్గొన్నారు.

రెడ్డి ల్యాబ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

నల్లగొండ: రెడ్డి ల్యాబ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు సంస్థ నిర్వాహకురాలు అల్మాస్ పర్వీన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ ఆపరేటర్, కమ్యూనికేషన్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్, సాఫ్ట్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, టైపింగ్, సెక్టార్ రెడీనెస్, ఇంటర్వ్యూ స్కిల్స్ అంశాలపై రెండు నెలలపాటు శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి గల నిరుద్యోగులు గడియారం సెంటర్‌లో గల సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ ఫెయిల్, పాసైనవారు అర్హులన్నారు. 18 నుంచి 35 సంవత్సరాల లోపు వారు ఈ నెల 26లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 7032649925, 9177785983 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

డిసెంబర్‌లో జాతీయ సదస్సు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కళాశాలలో డిసెంబర్ 20, 21వ తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ తెలిపారు. ఎకనామిక్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో 'స్థిరమైన అభివృద్ధి అవకాశాలు, సవా ళ్లు' అనే అంశం జరిగే సదస్సు పోస్టర్‌ను సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సదస్సుకు హాజర య్యే వారు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సురేష్‌బాబు, సదస్సు కన్వీనర్ డాక్టర్ డి.మునిస్వామి, మల్లేశం, సీఓఈ బి.నాగరాజు, ఎన్‌సీసీ అధికారి సీహెచ్. సుధాకర్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు అనిల్ బొజ్జ, ఎన్ కోటయ్య, శ్రీధర్, కిరీటం ఉన్నారు.

పడకేసిన 'ప్రత్యేక' పాలన

- గ్రామాల వైపు చూడని ప్రత్యేకాధికారులు
- పల్లెల్లో పేరుకుపోయిన సమస్యలు
- పంచాయతీ కార్యదర్శులపై పనిభారం


పెద్ద దేవులపల్లిలో అధ్వానంగా ఉన్న వీధులు, మురుగు కాలువలు

త్రిపురారం : పంచాయతీల్లో సర్పంచ్‌ల పాలన ముగిసిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం సర్పంచ్‌ల స్థానంలో విధులు నిర్వహించడానికి ప్రత్యేకాధికారుల పాలన తీసుకువచ్చింది. మండలంలో వివిద శాఖలకు చెందిన అధికారులను గ్రామాలకు ప్రత్యేక అధికారులుగా నియమించింది. కొందరు అధికారులకు రెండు గ్రామ పంచాయతీలనూ అప్పగించారు. అధికారులు సొంత కార్యాలయాలకే పరిమితమై గ్రామాల్లో ప్రత్యేక పాలనపై దృష్టి సారించలేకపోతున్నారు. ప్రత్యేక అధికారులు గ్రామాల వైపు రాకపోవడంతో పంచాయతీ కార్యదర్శులపై భారం పడింది. కొందరు పంచాయతీ కార్యదర్శులు సైతం గ్రామాకు రావడంలేదని, చెప్పినా పట్టించుకోవడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం గ్రామాలకు సమయానుసారం నిధులు కేటాయించడంలేదని గ్రామాల్లో సర్పంచ్‌లు లేకపోవడం వల్ల శానిటైజేషన్, ఫాగింగ్, వీధి దీపాల నిర్వహణ, ట్రాక్టర్ల నిర్వహణ, ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించడానికి అప్పులు చేయాల్సి వస్తుందని కొందరు కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పారిశుద్ధ్యం అస్తవ్యస్తం

మండలంలో 32 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. సర్పంచ్, ఎంపీపీ, జెడ్పీటీసీల పదవి కాలం ముగిసిన తర్వాత జరుగుతున్న ప్రత్యేక పాలనలో తాగునీరు, వీధి దీపాలు, పరిశుభ్రత తదితర సమస్యలు గ్రామాల్లో పేరుకపోయాయి. పలు గ్రామాలు, తండాల్లో డ్రెయినేజీల్లో మురుగు నీరు నిల్వ ఉండడంతో దుర్వాసన వెదజల్లుతూ దోమలు వృద్ధి చెంది రోగాలబారిన పడుతున్నారు. దోమల నివారణకు ఏ గ్రామంలో చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. పలు గ్రామాల్లో ఉన్న ఫాగింగ్ మిషన్లు పని చేయడం లేదు. పలు గ్రామాల్లో నీటి సరఫరా ట్యాంక్‌లు శుభ్రం చేయకపోవడం వల్ల మురుగు నీరు సరఫరా అవుతుందని, నీరు నిండిన తరువాత వాటిని సక్రమంగా చూసుకోకపోవడం వల్ల నీరు వృథా అవుతుందని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. ఇటీవల స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టి విస్తృతంగా నిర్వహించాలని ఆదేశించారు. కాని మండలంలో 32 గ్రామ పంచాయతీల్లో ఎక్కడా సరైన పద్ధతితో స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమం నిర్వహించిన దాఖాలు లేవు . మొదటి రోజు మండల కేంద్రంలో హడావిడి చేసిన అధికారులు తూతూ మంత్రంగా నిర్వహించి తర్వాత ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కారు. కొన్ని గ్రామాల్లో భగీరథ నీరు వారం రోజులు కూడా నిలిపివేస్తున్నారు. ఇంకుడు గుంతలపై కూడా నిర్లక్ష్యంగా ఉంటున్నారని అవగాహన కల్పించాలని కోరుతున్నారు.

పాలనపై దృష్టి పెట్టాలి



పత్యేక అధికారులు గ్రామాల్లో పర్యటించి పాలనపై దృష్టి పెట్టాలి. కొందరు ప్రత్యేక అధికారులు ఇప్పటి వరకు గ్రామలకు వెళ్లలేదు. సర్పంచ్‌లు లేకపోవడం వల్ల ప్రజలు సమస్యలు ఎవ్వరికి చెప్పుకోవాలో తెలియడంలేదు. కొన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు కూడా అందుబాటులో ఉండడంలేదు.

- పానుగోటి హరీష్, త్రిపురారం

నిరంతరం పర్యవేక్షించాలి



గ్రామాల్లో పర్యవేక్షణ చేసి అభివృద్ధి జరిగే విధంగా చర్యలు తీసుకోవాలి. గారమాల్లో పారిశుద్ధ్య లోపించి విష జ్వరాలతో కొన్ని గ్రామాల ప్రజలు మంచం పట్టారు. నిత్యం వర్షాలు కురుస్తుండడంతో పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు చేపట్టే విధంగా ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవాలి.

- దైద శ్రీను, త్రిపురారం

సర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలి



ప్రత్యేక అధికారుల పాలన మండలంలో అస్తవ్యస్తంగా ఉంది. గ్రామాల్లో సర్పంచ్‌లు లేకపోవడం వల్ల అభివృద్ధి పనులు జరగడంలేదు. గ్రామాల్లో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండడంలేదు. గ్రామాలకు ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేసి, సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించాలి.

- జి. వెంకటేశ్వర్లు, పెద్దదేవులపల్లి

సమస్యల పరిష్కారానికే ప్రజాపాలన

- మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి


ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

వేములపల్లి : ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమాన్ని చేపట్టిందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమంలో ఆయన ప్రజాపాలనలో భాగంగా సమస్యలపై వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ప్రజలకు సహనంతో సమాధానం చెప్పాలని, సత్వరమే ఆ సమస్యలను పరిష్కరించాలన్నారు. అన్ని శాఖల అధికారులు ప్రజా సమస్యలపై దృష్టి సారించాలన్నారు. రాజకీయాలకు అతీతంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు సమన్వయంతో నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడాలన్నారు. రైతులు బాగుంటేనే రాష్ట్రం, దేశం బాగుంటుందన్నారు. మండలంలో అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు కృషి చేయాలన్నారు. అదేవిధంగా మండలంలోని సల్కునూరు గ్రామంలో పీఏసీఎస్‌లో సుమారు రూ.25లక్షల నాబార్డ్ నిధులతో నిర్మించిన గోదాంను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నిధులు డ్రా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వినతి



సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న మట్టయ్య

మిర్యాలగూడ : థర్మల్ పవర్‌ప్లాంట్ భూ నిర్వాసితుల నష్టపరిహారాన్ని ఆర్డీఓ ఫోర్జరీ సంతకంతో డబ్బుల డ్రా చేసిన వారిపై చర్యలు తీసుకోవాని కోరుతూ సోమవారం ఏఐకేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వస్కుల మట్టయ్య సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మట్టయ్య మాట్లాడుతూ ఆర్డీఓ కార్యాలయం నుంచి చెక్కులు మాయం అయ్యాయంటే సెక్షన్ అధికారి ప్రమేయం లేకుండా అది జరగదని, ఇప్పటి వరకు ఎంత డబ్బులు రికవరి చేశారో బహిరంగ ప్రకటన చేయాలన్నారు. ఆర్డీఓ కార్యాలయంలోని సిబ్బంది చేతివాటంతోనే ఈ వ్యవహారం జరిగిందని ఆయన ఆరోపించారు. మొదటి నుంచి పవర్ ప్లాంట్ భూనిర్వాసితుల పేరిట మంజూరైన చెక్కులు అనర్హులకు ఇచ్చినట్లు తెలుస్తుందన్నారు. నగదు డ్రా చేసిన వారిపై ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదో చెప్పాలన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఫోర్జరీ చేసి నగదు డ్రా చేసిన వారిపై చర్యలు తీసుకోని డబ్బులను రికవరి చేయాలని, లేనట్లయితే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాశి, సైదమ్మ, మోహన్‌నాయక్, రామాంజి జ్యోతి, చంద్రకళ , తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం



పోలీస్ అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు, విద్యార్థులు

దేవరకొండ : పట్టణంలోని దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీ పోలీసుల అమరవీరుల స్థూపానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో శాంతిభద్రతలు కాపాడటమే లక్ష్యంగా 24గంటల పాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్న పోలీసుల సేవలు చిరస్మరణీయం అన్నారు. విధి నిర్వహణలో, దేశ రక్షణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరుల ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ లీగల్ అడ్వైజర్ ఉమామహేశ్, స్పోర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీధర్, కృష్ణకిశోర్, అమర్, భాస్కర్ రెడ్డి, సురేష్, వేముల రాజు, కృష్ణ, శ్రీను, వెంకటేష్, గోపాల్, నగేష్ పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు ప్రారంభం


సభ్యతం నమోదు చేస్తున్న బీజేపీ నాయకులు

చింతపల్లి : మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ సభ్యత నమోదు స్టాల్ ఆ పార్టీ మండల అధ్యక్షుడు శివర్ల రమేశ్ యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ నరేంద్ర మోదీకి మద్దతుగా బీజేపీలో చేరాలనుకునే వారికి అందుబాటులో నమో స్టాల్ పేరుతో సభ్యత్వ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వనం నరేందర్‌రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి వెన్నం శేఖర్ కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు గోవర్ధన్, శ్రీశైలం యాదవ్ బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి అభినవ్ గౌడ్, బూతు అధ్యక్షులు వెంకటరమణ, రవి, రాజు, మహేందర్, నరసింహ పాల్గొన్నారు.

'ప్రజావాణి' సద్వినియోగం చేసుకోవాలి


ప్రజావాణిలో పాల్గొన్న విద్యుత్ ఏఈ బాలునాయక్

త్రిపురారం : ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని త్రిపురారం ఎంపీడీఓ విజయ కుమారి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు దరఖాస్తుదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాను సారం ప్రతి సోమవారం మండల కేంద్రంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పలువురు మండల అధికారులు ప్రజావాణి కార్యక్రమానికి గైర్హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అధి కారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు

ఎంఈఓలకు సన్మానం


ఎంఈఓలను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కొండమల్లేపల్లి : స్థానిక మండల వనరుల కేంద్రంలో పీఆర్టీయూ ఆధ్వర్యంలో సోమవారం ఎంఈఓ మాతృనాయక్‌కు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కొండమల్లేపల్లి ఇన్‌చార్జ్ ఎంఈఓగా 11ఏళ్ల పాటు మాతృనాయక్ బదిలీ అయ్యారు. అలాగే నూతన ఎంఈఓగా బాధ్యతలు స్వీకరించిన ఆర్.నాగేశ్వర్‌రావుకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు ఎ.అంజయ్య, పీఆర్టీయూ జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు వాసికర్ల రమేష్, యూటీఎఫ్ బాధ్యులు సంజీవకుమార్, టియూపీఎస్ బాధ్యులు సైదులు, కట్టెబోయిన శ్రీనవాస్, హెచ్‌ఎం ఉదయశ్రీ, శోభారాణి, వెంకట్‌రెడ్డి, జగదీశ్వర్, బాలకృష్ణారెడ్డి, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పది' నాణేల వినియోగంపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న బ్యాంకు సిబ్బంది

నల్లగొండ: అన్ని బ్యాంకుల్లో పది రూపాయల నాణేలు చెల్లుబాటు అవుతున్నాయని, అందరూ నాణేలు తీసుకోవాలని కోరుతూ గ్రామీణ వికాస బ్యాంకు ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణంలో సోమవారం ప్రజలకు అవగాహన కల్పించారు. బ్యాంక్ సిబ్బంది బ్యానర్లు పట్టుకుని షాపులు తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. చిన్న వ్యాపారులంతా పది రూపాయల నాణేలు తీసుకోవడం లేదని, దాంతో రిజర్వు బ్యాంకు సూచన మేరకు ప్రచారం చేస్తున్నట్లు బ్యాంక్ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామీణ వికాస్ బ్యాంకు రీజనల్ మేనేజర్ బి. విజయభాస్కర్, సీహెచ్.వెంకటేష్, ఎం.దేవేందర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పెట్టుబడి సాయం అందిస్తాం

- దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్


చింతపల్లి : వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్


దేవరకొండ : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్


చందంపేట : ధాన్యంకొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

చింతపల్లి : అర్హులైన రైతులందరికీ పెట్టుబడి సాయం అందిస్తామని ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. సోమవారం మండలంలోని మండలంలోని కుర్మేడ్ గ్రామంలో నాఫెడ్ సహకారంతో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రం, మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రానలు ఆయన ప్రారంభించి మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ సర్కార్ నిధులు ఇవ్వకుండా వదిలేసిన చాలా పథకాలకు కాంగ్రెస్ అధికారంలో వచ్చిన తర్వాత నిధులు విడుదల చేసిందని, దీంతో తమకు రైతుల సంక్షేమంపై కాంగ్రెస్ ప్రభుత్వ చిత్త శుద్ధికి నిదర్శనమన్నారు. రైతు భరోసాపై మంత్రి వర్గ ఉప సంఘం నివేదిక రూపొందిస్తుందని, ఆ ఉప సంఘం నివేదిక వచ్చిన తర్వాతే తెలంగాణలో వచ్చే యాసంగి సీజన్ నుంచి రైతు భరోసా పథకం అమలు చేస్తామని, ఎకరానికి రూ.7500 చొప్పున ఇస్తామని పేర్కొన్నారు. వచ్చే సీజన్ నుంచి పంటల భీమా పథకం అమలు చేస్తామన్నారు. గత ప్రభుత్వం హయాంలో రైతు బంధు కింద కొండలు, గుట్టలు, రియల్ ఎస్టేట్, వెంచర్లు, సాగులో లేని భూములకు సైతం దాదాపు రూ.25 వేల కోట్లు ఇచ్చారని ఆరోపించారు. ఆర్థిక వెసులుబాటు లేకపోయినా రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేశాం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఉజ్జయిని యాదగిరి రావు, నల్గొండ పార్లమెంట్ కోఆర్డినేటర్ సిరాజ్ ఖాన్, మండల పార్టీ అధ్యక్షులు నాగభూషణం, మార్కెట్ కమిటీ చైర్మన్ అలివేలు సంజీవ రెడ్డి, మాజీ ఎంపీపీ భవాని పవన్ కుమార్, మాజీ జెడ్పీటీసీ హరి నాయక్, మాస భాస్కర్, మాజీ సర్పంచ్ గిరి, డీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ ,కొండల్ యాదవ్, సదనదన్, సహకార సంఘం చైర్మన్ వెంకటయ్య, ఆ శ్రీ లక్ష్మి, వ్యవసాయ అధికారి శ్రావణి కుమారి, సీఈఓ మల్లేష్, తహసీల్దార్ రమాకాంత్ శర్మ, ఎంపీడీఓ సుజాత, ఆర్ ఐ.సునీత, ఏఈఓ నర్సింహా, బేసిక్ సంస్థ సంగమేశ్వర్ రావు

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో వివిధ గ్రామాలకు చెందిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు సోమవారం దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ చెక్కులు పంపిణీ చేశారు.అనంతరం ఆయన మాట్లాడారు. దేశంలోనే ఈ పథకం ఆదర్శంగా నిలిచిందన్నారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన 31 చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఉజ్జయిని యాదగిరి రావు,నల్గొండ పార్లమెంట్ కోఆర్డినేటర్ సిరాజ్ ఖాన్, మండల పార్టీ అధ్యక్షులు నాగభూషణం, మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతం అలివేలు సంజీవ రెడ్డి, మాజీ ఎంపీపీ భవాని పవన్ కుమార్, చింతపల్లి మాజీ సర్పంచ్ గిరి, డీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య గౌడ్, కోపరేట్ బ్యాంక్ చైర్మన్ వెంకటయ్య, నర్సింహారెడ్డి, తహసీల్దార్ రమాకాంత్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

దేవరకొండ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. సోమవారం దేవరకొండ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జమునామాధవరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మొదటి పాలకవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ జమునామాధవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ నర్సింహ, పీఏసీఎస్ చైర్మన్ జాల నర్సింహారెడ్డి, మార్కెట్ సెక్రెటరీ కిరణ్‌కుమార్, ఏడీ శ్రీలక్ష్మి, డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

చందంపేట : నేరెడుగొమ్ము మండలంలోని పేర్వాల గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ప్రారంభించి మాట్లాడారు. సన్నాలు పండించే రైతులకు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తున్నందున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులు దళారులను నమ్మి మోసపోకూడదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి అని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్లు జాలె నర్సింహారెడ్డి, కొండ్ర శ్రీశైలంయాదవ్, ముక్కమల వెంకటయ్య, మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణయ్య, కోతి యుగేందర్‌రెడ్డి, వెంకటయ్య, బిక్కునాయక్, తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సక్రమంగా అమలు చేయాలి


మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్

నల్లగొండ టౌన్ : జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా చేపట్టిన ఆరోగ్య పథకాలను సక్రమంగా అమలు చేసే విధంగా సిబ్బంది పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ సూచించారు. సోమవారం స్థానిక టీఎన్జీవో భవన్‌లో దేవరకొండ డివిజన్‌కు సంబంధించిన మెడికల్ ఆఫీసర్లు, ప్రోగ్రామ్ ఆఫీసర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన పథకాలను సక్రమంగా అమలు చేసి ప్రజలకు ప్రభుత్వ వైద్యాన్ని చేరువ చేయాలన్నారు. సమావేశంలో ప్రోగ్రాం అధికారులు, మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

కోణం ఫౌండేషన్ కృషి అభినందనీయం

నల్లగొండ టౌన్: రైతుల అభివృద్ధి సంక్షేమం కోసం కోణం ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పి.శ్రావణ్ కుమార్ అన్నారు. నల్లగొండ వ్యవసాయ కార్యాలయంలో సోమవారం కోణం ఫౌండేషన్ సహకారంతో కట్టంగూరు ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ రూపొందించిన కస్టమ్ హైరింగ్ సెంటర్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కస్టమ్ హైరింగ్ సెంటర్ సదుపాయాలను 7780507439 నంబర్‌కు ఫోన్ చేసి రైతులు పొందాలని సూచించారు.

ధర్నా పోస్టర్ విడుదల



పోస్టర్ విడుదల చేస్తున్న సంఘం నాయకులు

నల్లగొండ: ఉద్యోగులకు పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో చేపట్టనున్న ఉపాధ్యాయ ధర్మాగ్రహ దీక్ష ధర్నా పోస్టర్‌ను సోమవారం నల్లగొండలోని తపస్ కార్యాలయంలో సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అలుగువెల్లి పాపిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఇరుగు శ్రీరామ్ విడుదల చేశారు. ఈ నెల 22న పాఠశాలల్లో నల్ల బ్యాడ్జీలతో నిరసన, 28న అన్ని మండల తహసీల్దార్ కార్యాలయాల్లో సమస్యలపై వినతి, నవంబర్ 5న కలెక్టరేట్ వద్ద ధర్నా, 23న ఉపాధ్యాయ ధర్మాగ్రహ దీక్ష పేరిట హైదరాబాద్ చలో ఇందిరా పార్క్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రేణిగుంట రాజశేఖర్, మిర్యాల మురళి, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, చక్రధర్ పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరులకు నివాళి



పోలీసు అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి వెంకట్‌రెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి



నివాళులర్పిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్, చిన్నారులు